25న మెగా డిఎస్‌సి ఉపాధ్యాయులకు నియామక లేఖలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మెగా డిఎస్‌సి-2025లో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులందరికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సెప్టెంబర్ 25వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు అమరావతిలో నియామక లేఖ అందించనున్నట్లు డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన ఉపాధ్యాయులందరూ సెప్టెంబర్ 24వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరులో ఏర్పాటు చేసిన పది కేంద్రాలకు హాజరు కావాలని, సంబంధిత కేంద్రాల నుంచి 25వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు బస్సుల ద్వారా నేరుగా అమరావతిలోని కార్యక్రమ ప్రాంగణానికి చేరుకుంటారని తెలిపారు. అభ్యర్థులు రాత్రి బసకు అవసరమైన వస్తువులు తెచ్చుకోవాలని తెలిపారు. గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు ఈ కార్యక్రమానికి మినహాయింపు ఇచ్చినట్లు తెలిపారు.

ప్రజా ప్రతినిధులా.. ప్రజాకంఠకులా..!

నేవీ ఆయుధ డిపో బలవంతంగా ఏర్పాటు చేసేందుకు కుట్రలు

ఎంపీ, ఎంఎల్ఎ తీరుపై జనాల్లో తీవ్ర చర్చ

మూడుసార్లు గ్రామసభ వ్యతిరేకించినా నిరంకుశ ధోరణితో ముందుకు

ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ తలపెట్టిన ర్యాలీపై ఉక్కుపాదం

30 యాక్ట్ అమల్లోకి తెచ్చి అడ్డుకునేందుకు యత్నం

గిరిజన, ప్రజా సంఘాల నాయకుల ముందస్తు నిర్బంధం కోసం వేట

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రజలకు అండగా ఉంటామంటూ ఓట్లు వేయించుకుని గెలిచిన తర్వాత అభివృద్ధి పేరుతో ప్రజాప్రతినిధులే.. ప్రజాకంఠకులుగా మారుతూ ప్రజలను హింసిస్తున్న పరిస్థితి కన్పిస్తోంది. పోలవరం నియోజకవర్గంలోని జీలుగుమిల్లి మండలంలో నేవీ ఆయుధ డిపో నిర్మించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు నిరంకుశంగా ముందుకెళ్తున్న ధోరణే అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పొచ్చు. తమ ప్రాంతంలో నేవీ ఆయుధ డిపో వద్దంటూ మూడుసార్లు గ్రామసభ వ్యతిరేకిస్తూ తీర్మానం చేసినా ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ముందుకు సాగుతున్న తీరుపై గిరిజనుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారుల తీరును నిరసిస్తూ మంగళవారం ఆయుధ డిపో నిర్మించే గ్రామాల ప్రజలంతా మడకంవారిగూడెం నుంచి శాంతియుతంగా ర్యాలీ చేపట్టి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఆయుధ డిపోకు వ్యతిరేకంగా తలపెట్టిన ర్యాలీని భగ్నం చేసేందుకు ప్రభుత్వం పోలీసులను రంగంలోకి దింపిన పరిస్థితి ఉంది. పోలవరం నియోజకవర్గంలోని మూడు మండలాలు జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, టి.నరసాపురం మండలాల్లో 30 యాక్ట్ అమల్లోకి తెచ్చినట్లు పోలీసులు ప్రకటించారు. తమ ప్రాంత భూములపై గిరిజనులకు హక్కు లేదన్నట్లు.. తమ భవిష్యత్తును నిర్ణయించుకునే అధికారం అడవి బిడ్డలకు లేదన్నట్లు ప్రజాప్రతినిధులు, అధికారులు వ్యవహరిస్తున్నారు. జీలుగుమిల్లి మండలంలోని వంకావారిగూడెం, దాట్లవారిగూడెం, మడకంవారిగూడెం, రమణక్కపేట, కొత్తసీమలవారిగూడెం గ్రామాల పరిధిలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు చేయాలని 2023లో గత వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రయత్నాలు జరిగాయి. ఈ గ్రామాల పరిధిలో మొత్తం 1,166 ఎకరాల భూమి సేకరించాలని నిర్ణయించారు. అప్పట్లో రెండుసార్లు నిర్వహించిన గ్రామసభల్లో అక్కడి ప్రజలు నేవీ ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2024 అక్టోబర్ 28న పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలోనూ ప్రజలు ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ మరోసారి తీర్మానం చేశారు. మూడుసార్లు ప్రజలు వ్యతిరేకంగా తీర్మానం చేసిన తర్వాత కూడా అక్కడ ఆయుధ డిపో ఏర్పాటు చేయాలని చూడటం వెనుక పెద్దఎత్తున కుట్ర ఉన్నట్లు చర్చ నడుస్తోంది. ఇదంతా ఎంపీ, ఎంఎల్ఎ కావాలనే చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయుధ డిపో ఏర్పాటుతో ఎటువంటి ఉద్యోగ అవకాశాలూ రావు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగానూ ఉపాధి లభిస్తుందని చెప్పి గిరిజనులను నట్టేట ముంచేశారు. ఇప్పటికీ పరిహారం ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతున్నారు. తరలించిన ప్రజలు ఉపాధి లేక అల్లాడిపోతున్నారు. ఆయుధ డిపో ఏర్పాటు వెనుక ప్రజాప్రతినిధులు ఎందుకు ఇంత దారుణంగా వ్యవహరిస్తున్నారని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. గిరిజనుల భూములు లాక్కుని ఉపాధి లేకుండా చేయాలని చూస్తున్నారు. రక్షణశాఖకు సంబంధించిన ఆయుధ డిపో ఏర్పాటైతే వచ్చే ఆంక్షల గురించి అందరికీ తెలిసిందే. మైదాన ప్రాంతాల్లో భూములు ఉన్నప్పటికీ గిరిజనులపై కక్షగట్టినట్లు ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్న తీరు అందరినీ తీవ్ర ఆవేదనకు గురి చేస్తోంది.



పోలీసు నోటీసు

జీలుగుమిల్లి సర్కిల్ ప్రజలకు పోలీసు విజ్ఞప్తి.ప్రజల శాంతి-భద్రతలకు అంతరాయం కలిగించే లేదా ప్రజా శాంతి భంగం కలిగించే ఏవైనా సమావేశాలు, ర్యాలీలు, గుంపులుగా కూడికలు వంటి కార్యక్రమాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి.జీలుగుమిల్లి సర్కిల్ పరిధిలోని జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం, టి.నరసాపురం మండలాలలో శాంతి భద్రతను కాపాడడానికి సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంది.అందువల్ల అనుమతి లేకుండా ఏవైనా కార్యక్రమాలు నిర్వహించినట్లయితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయి.

సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ ప్రకారం—

- గుంపులుగా కూడడం
- ప్రజా శాంతికి భంగం కలిగించడం
- ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడంవంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు.

కాబట్టి జీలుగుమిల్లి సర్కిల్ ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సహకరించవలసిందిగా కోరడమైనది.

సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్
జీలుగుమిల్లి సర్కిల్
Circle Inspector of Police
Jeelugumilli Circle

30 యాక్ట్ అమలు చేస్తున్నట్లు పోలీసులు జారీ చేసిన ఉత్తర్వులు

తీవ్రరూపం దాల్చనున్న ఆయుధ డిపో వ్యతిరేక పోరాటం

ఆయుధ డిపోకు వ్యతిరేకంగా చేపడుతున్న ప్రజా ఉద్యమాలను అణిచివేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు చూస్తున్నారు. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో తుందుర్రు ఆక్వా ఫుడ్‌పార్క్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని ఇదేవిధంగా అణచివేయాలని అప్పట్లో తీవ్ర నిర్బంధం సాగింది. దీంతో తుందుర్రు పోరాటం జిల్లాను, రాష్ట్రాన్ని సైతం కుదిపేసింది. ఆ దెబ్బకు 2019 ఎన్నికల్లో జిల్లాలో టిడిపి రెండు సీట్లకే పరిమితమైంది. నేవీ ఆయుధ డిపోకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం సైతం రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారే పరిస్థితి కనిపిస్తోందనే చర్చ సాగుతోంది. గిరిజన ప్రజాప్రతినిధులు గిరిజనులకు అండగా ఉంటారో.. వ్యతిరేకంగా పని చేస్తారో వేచిచూడాలి.

అర్జీదారులతో మాట్లాడి పరిష్కారం చూపాలి

అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీలు 306 : కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో అధికారులు నేరుగా అర్జీదారులతో మాట్లాడి వారు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ ఎం.అచ్యుతఅంబరీష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎల్.దేవకిదేవి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్, సర్వే ఎడి అన్సారీ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ మన దగ్గరకు వచ్చిన ఫిర్యాదుదారులను ఆప్యాయంగా పలకరించి సమస్యలను పూర్తిగా విని చక్కని పరిష్కారం చూపాలన్నారు. పిజిఆర్ఎస్‌లో ప్రజలు ఇచ్చిన అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఏ శాఖకు వచ్చిన అర్జీలు ఆయా శాఖ వారు మాత్రమే పరిష్కారం చూపాలని, వేరే శాఖకు పంపితే కాలయాపన జరిగి సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. వచ్చిన ప్రతి అర్జీని ఒక ఛాలెంజీగా తీసుకుని పరిష్కారం చేసినట్లయితే జూనియర్ అధికారులకు మంచిస్ఫూర్తి కలుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో ఉత్పన్నమయ్యే సమస్యలకు క్షేత్రస్థాయిలోనే పరిష్కారం చేసి అర్జీలు రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

కొనసాగుతున్న గోదారమ్మ దోబూచులాట

పెరుగుతూ.. తగ్గుతూ.. పెరుగుతున్న గోదావరి వరద

ప్రజాశక్తి - పోలవరం

ఎగువ రాష్ట్రాలు, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కొన్ని రోజులు పెరుగుతూ, ఆపై తగ్గుతూ దోబూచులాడుతున్న గోదావరి వరద సోమవారం సాయంత్రానికి మళ్లీ పెరిగింది. ప్రాజెక్టు స్పిల్వే నుండి 4,64,186 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేసినట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 29.880 మీటర్లు, స్పిల్వే దిగువన 20.500 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్ ఎగువన 30.150 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్ దిగువన 20.050 మీటర్లు, ఎగువ, దిగువ కాఫర్ డ్యాముల మధ్య 15.950 మీటర్లు నీటిమట్టం నమోదైంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 32.3 అడుగులకు చేరుకుంది.

పొంగి ప్రవహిస్తున్న ముగ్గురాళ్ల వాగు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ముగ్గురాళ్ల వాగు, జలవాగు మళ్లీ పొంగి ప్రవహిస్తున్నాయి. ఇటీవల భారీ వర్షాలతో వాగులు ఉధృతంగా ప్రవహించడంతో మండలంలోని బండివారిగూడెం - మక్కినవారిగూడెం, టి.నరసాపురం - మక్కినవారిగూడెం గ్రామాల మధ్య రెండు రోజుల పాటు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. మరోసారి ఆదివారం రాత్రి భారీ వర్షం కురవడంతో ముగ్గురాళ్లవాగు, జలవాగు వంతెనపై నుంచి పొంగి ప్రవహిస్తుండడంతో ఆ మార్గంలో వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న అధికారులు, పోలీసు సిబ్బంది వాగును పరిశీలించి రోడ్లను నిర్బంధించి ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. అయితే వర్షాలు కురిసిన ప్రతిసారి వాగులు ఉధృతి ఉండడం, వంతెనల నిర్మాణాలు సరిగా లేకపోవడం వల్లే అని కాలువల ప్రవాహం అంచనా వేసి అధికారులు వంతెనలు నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొంగి ప్రవహిస్తున్న వాగు

పని గంటల పెంపును తక్షణం విరమించుకోవాలి

సిఐటియు ఆధ్వర్యాన నిరసనల వెల్లువ

ఏలూరు అర్బన్ : ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

టిడిపి కూటమి ప్రభుత్వం 8 గంటల పని దినం స్థానంలో 10 గంటల పని దినం బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు ఊడిగం చేయడం కోసమే పది గంటల పని దినం తీసుకువస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 139 సంవత్సరాల క్రితమే కార్మికుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 8 గంటల పని దినాన్ని మార్చాలనుకుంటే కార్మికవర్గం సహించదన్నారు. కార్మికుల కనీస వేతన జిఒలు సవరించాలని ఎంతోకాలంగా కార్మిక సంఘాలు కోరుతున్నా పట్టించుకోని చంద్రబాబు యాజమాన్యాలకు దోచిపెట్టడం కోసమే పని గంటలు పెంపుదల చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తుండగా వారి కంటే ముందుగానే చంద్రబాబు కార్మిక చట్టాల సవరణ చేస్తూ 10 గంటల పని విధానాన్ని రాష్ట్రంలో కార్మిక వర్గంపై రుద్దుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో కూడా మహిళలు పనిచేసే విధంగా చట్ట సవరణలు చేయడం దుర్మార్గమన్నారు. తక్షణమే పని గంటల పెంపు బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి ఎం.ఇస్సాక్, నాయకులు జె.గోపీ, పి.రవికుమార్, వివిఎన్.ప్రసాద్, ఎర్ర రాంబాబు, లోకేశ్వరి, అరుణకుమారి, మోహిద్దీన్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: పని గంటలు పెంపు యోచన దుర్మార్గమని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు అన్నారు. నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్లో సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మోడీ, కార్పొరేట్ కంపెనీల మెప్పు కోసం చంద్రబాబు ఇలాంటి కార్మిక వ్యతిరేక నిర్ణయాలు చేశారని విమర్శించారు. కేంద్రం బాటలో చంద్రబాబు ప్రభుత్వం పయనిస్తూ కార్మికుల హక్కులను హరిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు తక్షణం ఉపసంహరించుకోవాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, లైసెన్స్ కలిగిన ప్రతి ఆటో కార్మికుడికి షరతులు లేకుండా వాహన మిత్ర అమలు చేయాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్ఆర్.హనుమాన్లు, శోభనాద్రి, ప్రభాకర్, రంగారావు, ప్రసాద్, రామారావు, రాజు, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నిరసన తెలుపుతున్న సిఐటియు నేతలు

ద్వారకాతిరుమలలో...

ద్వారకాతిరుమల: పని గంటల పెంపును నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మండలంలోని సిహెచ్.పోతేపల్లి గ్రామంలో గోద్రెజ్ పామాయిల్ ఫ్యాక్టరీ వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కరోనా సమయంలో తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ అమలులో భాగంగా రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చే 13 గంటల పని విధానాన్ని తీసుకొచ్చిందని, ఇది కార్మికుల మీద దాడేనని అన్నారు. వైసిపి దీన్ని శాసనమండలిలో వ్యతిరేకించి బిల్లు రద్దుకు కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి గోపీమూర్తి ఇప్పటికే శాసనమండలిలో దీన్ని వ్యతిరేకించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో గోద్రేజ్ పామాయిల్ ఫ్యాక్టరీ (సిఐటియు) యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు బాలకృష్ణ, పెద్దిరాజు పాల్గొనగా, ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు సంఘీభావం తెలిపి మాట్లాడారు.

పని గంటల పెంపు దారుణం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలోని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ఎనిమిది గంటల పని విధానం స్థానంలో 13 గంటల పని విధానాన్ని తీసుకొచ్చేందుకు బిల్లు ఆమోదించడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. 139 సంవత్సరాల మేడే పోరాట స్ఫూర్తికి విఘాతం కలిగించే చర్యలను మానుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను మోడీ ప్రభుత్వం తీసుకువస్తే, తామేమీ తక్కువ కాదన్నట్లుగా రాష్ట్రంలోని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. పని గంటల పరిమితి పెరిగితే కార్మిక వర్గం తమ సాంఘిక జీవితాన్ని, కుటుంబ జీవితాన్ని కోల్పోవడమే కాకుండా వారి జీవితకాలం కుదించబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం స్వదేశీ, విదేశీ బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే ఈ బిల్లు తీసుకువచ్చారని ఆరోపించారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి 8 గంటల పనికి బదులుగా 6 గంటల పని దినాన్ని అమలు చేయడం మంచిదని తెలిపారు. కార్మిక వర్గానికి నష్టం కలిగించే బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో మరో మేడే ఉద్యమాన్ని నిర్వహించాల్సి వస్తుందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

రోడ్లకు మరమ్మతులు చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - నిడమర్రు

మండలంలో ఆర్అండ్‌బి రోడ్లు, గ్రామాల లింక్ రోడ్లు వెంటనే బాగు చేయాలని, రోడ్డు ప్రమాదాల నుంచి కాపాడాలని, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు నిడమర్రు-మండలపర్రు ఆర్అండ్‌బి మెయిన్ రోడ్డులో సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నారపల్లి రమణారావు మాట్లాడుతూ రోడ్ల సమస్యపై గత పది నెలల క్రితం సిపిఎం వినతిపత్రం అందించడంతో కూటమి ప్రభుత్వం స్పందించి ఆర్అండ్‌బి మెయిన్ రోడ్డులో హడావుడిగా గోతులు పూడ్చారన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న గోతులను తాము పూడ్చామని గొప్పలు చెప్పుకున్నారన్నారు. మళ్లీ రెండు నెలలకే రోడ్లు ఛిద్రమైపోయాయని చెప్పారు. దీంతో ఎంతోమంది ప్రమాదానికి గురయ్యారన్నారు. వెంటనే ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పుంతలో మునలమ్మ ఆలయం ఎస్‌టర్నింగ్, మండలపర్రు కాపార్వ కాలువ వంతెనకు రెండు వైపులా ప్రాంతాల్లో ఆర్అండ్‌బి మెయిన్ రోడ్డులో గోతులను పూడ్చి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. పెదనిండ్రకొలను నుంచి మండల కేంద్రానికి రావడానికి, నిడమర్రు నుంచి గణపవరం వెళ్లడానికి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఈ ధర్నాలో సిపిఎం నాయకులు గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన, కానూరు రాజు, లావేటి సోంబాబు పాల్గొన్నారు.

హమాలీలకు బకాయి వేతనాలు చెల్లించాలి

అల్లూరి సీతారామరాజు హమాలీ జట్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ధర్నా, వినతి

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

హమాలీల మూడు నెలలు బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు అల్లూరి సీతారామరాజు హమాలీ జట్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం, జిసిసి ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ రమేష్‌కు, గోడౌన్ ఇన్‌ఛార్జి బుల రామకృష్ణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరుకుల పంపిణీ కోసం సమాజానికి సేవచేస్తున్న హమాలీ కార్మికులు చాలీచాలని కూలి రేట్ల వల్ల కుటుంబ పోషణ గడవక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కుక్కునూరు జిసిసి ఎంఎల్‌సి పాయింట్ పరిధిలో 14 మంది హమాలీలు ఎగుమతులు, దిగుమతులు కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చేస్తున్నారన్నారు. గోదావరి వరదల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు జూన్ నెలలో జూలై, ఆగస్ట్, సెప్టెంబర్ మూడు నెలలకు సంబంధించిన స్టాక్ రేషన్ షాపులకు అందించారన్నారు. ఆ తోలకాలకు సంబంధించిన బిల్లు ఇప్పటికీ ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ గడవక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారులు కారణాలు చెబుతూ కాలయాపన చేస్తూ హమాలీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ అధికారులు ఇప్పటికైనా స్పందించి హమాలీలకు రావాల్సిన బకాయి బిల్లులు వెంటనే అందించాలని, బకాయి ఉన్న ఏరియర్స్ కూడా వెంటనే ఇవ్వాలని, దసరా బోనస్ జిసిసి హమాలీలకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే పనులు ఆపేసి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో హమాలీ మేస్త్రి కారం రమేష్, కడారి తిరపతయ్య, తిరోజుల సురేష్, సాయిరాం, వెంకటేష్, విక్రమ్, లక్ష్మణ్, వెంకట్రావు, రామ్ చరణ్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న నేతలు

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు సోమవారం స్థానిక విద్యుత్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా చేశారు. ఆర్ఆర్.పేట, ఏలూరు సర్వజన ఆసుపత్రి, ఫైర్ స్టేషన్ సెంటర్, జిల్లా పరిషత్ సెంటర్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. వేలాదిమంది రెగ్యులర్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏలూరు చేరుకుని ర్యాలీలో పాల్గొని విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగులకు ఉన్న ఆర్థిక బకాయిలు ప్రభుత్వం చెల్లించాలని నినాదాలు చేశారు. ఐదు జిల్లాల డిస్కం జెఎసి కన్వీనర్ భూక్య నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ శాఖలో ఉన్న 25 వేల మంది పర్మినెంట్ ఉద్యోగులు, 26 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు అనేక సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఆందోళనా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. విద్యుత్ యాజమాన్యాలు వారి న్యాయమైన కోర్కెలు తీర్చాలన్నారు. 1999 ఫిబ్రవరి ఒకటో తేదీ తర్వాత ఉద్యోగంలో చేరిన ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2 ఉద్యోగులకు పాత సర్వీస్ కండిషన్స్ అమలు చేయాలని, వారికి ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా జెఎసి కన్వీనర్ వి.రాము మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. డిస్కం కో-కన్వీనర్ తురగా రామకృష్ణ, నాయకులు సంజీవ్, గంగాధర్, తారా సింగ్ నాయక్, ఎస్‌డి అబ్బాస్, అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో ఉద్యోగులు

డిగ్రీ కాలేజీలో పొలిటికల్ సైన్స్ సబ్జెక్టు బోధించాలి

హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనర్‌కు ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎకు పొలిటికల్ సైన్స్ సబ్జెక్టు మేజర్‌గా ఇవ్వాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళగిరిలో హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనర్ భరత్ గుప్తను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఉన్న డిగ్రీ కళాశాలలో అన్ని కోర్సులు ఉండాలని, పొలిటికల్ సైన్స్ విద్యను అభ్యసించడానికి 20 మంది విద్యార్థులు ఉన్నారని, బోధించడానికి అధ్యాపకులు కూడా ఉన్నారని, అయినప్పటికీ పొలిటికల్ సైన్స్‌ను ఎందుకు మేజర్ సబ్జెక్టుగా తీసుకోలేదని ప్రశ్నించారు. కాలేజీలో రాజకీయాలు జరుగుతున్నాయా లేక విద్యార్థులకు సరిపడే గదులు లేవనే కారణంతో కొత్త కోర్సులు ఆపేస్తున్నారా అని ప్రశ్నించారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండు సంవత్సరాల్లో డిగ్రీ కళాశాల పనులు పూర్తి చేస్తామని నారా లోకేష్ యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చారని, కాని ఇప్పటివరకు శంకుస్థాపన కూడా జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే డిగ్రీ కళాశాలకు నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.శివాజీ, ఎం.జయంతు, వంశీకృష్ణ, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

వినతి అందిస్తున్న నేతలు

సాగు పట్టాల మంజూరు కోరుతూ వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తొవ్వచిలక రాయుడుపాలెం గ్రామ దళిత సాగుదారులకు సాగు పట్టాలు వెంటనే మంజూరు చేయాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవిప్రకాష్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ లింగపాలెం మండలం తొవ్వచిలక రాయుడుపాలెం గ్రామంలోని సర్వే నెంబర్ 37-1లో సుమారు 8.16 ఎకరాల భూమిని 15 దళిత కుటుంబాలు సుమారు 50 ఏళ్ల నుంచి సాగు చేసుకుని జీవిస్తున్నాయన్నారు. వీరికి సాగు పట్టాలు మంజూరు చేయాలని గత ప్రభుత్వం నుంచి దళిత సాగుదారులు తరఫున దళిత సేన ఆధ్వర్యంలో న్యాయబద్ధంగా పోరాటం నిర్వహిస్తున్నామని తెలిపారు. వీరు సాగు చేసుకునే భూముల విషయంలో అప్పటి డిఆర్ఒ పరిశీలించి అనంతరం మండల సర్వేయర్‌తో సర్వే కూడా చేయించారని, అనంతరం కలెక్టర్‌కు అసైన్‌మెంట్ సాగు పట్టాలు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించారని తెలిపారు. దళిత సాగుదారులకు సాగు పట్టాలు మంజూరు చేసే విషయంలో కలుగుతున్న ఆలస్యాన్ని తొలగించి వెంటనే సాగు పట్టాలు మంజూరు చేసి వీరికి భూమిపై హక్కు కల్పించాలని, ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సేన జిల్లా ఇన్‌ఛార్జి బూల్లా రవికుమార్, కృష్ణా జిల్లా దళిత సేన ఇన్‌ఛార్జి భూసే అనిల్ కుమార్, గుడివాడ పట్టణ దళిత సేన ఉపాధ్యక్షులు సుజన్ పాల్గొన్నారు.

ప్రముఖ పారిశ్రామికవేత్త వెంకట్రామయ్య మృతి

పలువురి ప్రముఖుల సంతాపం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని తుక్కులూరు గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, నూజివీడు సీడ్స్ వ్యవస్థాపక చైర్మన్, పీ4 పథకంలో మార్గదర్శి మండవ వెంకటరామయ్య సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. పలు సేవా కార్యక్రమాలు, పేదలకు అనేక సహాయ సహకారాలు అందించి అన్ని తరగతుల ప్రజల ఆదరాభిమానాలు పొందారు. భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మైలవరం ఎంఎల్ఎ వసంత వెంకటకృష్ణప్రసాద్, కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్, విజయవాడ ఎంఎల్ఎ సుజనా చౌదరిలు మండవ వెంకటరామయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో మహనీయులకు, నేటితరం యువ నాయకులకు మండవ వెంకట్రామయ్య ఆదర్శనీయమన్నారు. వెంకట్రామయ్య మృతి రాష్ట్రానికి తీరని లోటుగా పేర్కొన్నారు.


నివాళి అర్పిస్తున్న ప్రముఖులు

వాలిన విద్యుత్ స్తంభం

భయంతో జనం

ప్రజాశక్తి- ముదినేపల్లి

వాలిన విద్యుత్ స్తంభం ఏ క్షణాన జనం మీద పడుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితి మండల కేంద్రమైన ముదినేపల్లిలో నెలకొంది. అంబేద్కర్ నగర్లో మంచినీటి చెరువుగట్టుపై ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారింది. నిత్యం జనం ఈ దారిలో రాకపోకలు సాగిస్తుంటారు. స్తంభం ఒక పక్కకు వాలిపోవడంతో స్తంభానికి విద్యుత్ దీపం ఏర్పాటు చేసేందుకు అవకాశం లేకుండా పోయింది. విద్యుత్ దీపం ఏర్పాటు చేసేందుకు ఎలక్ట్రీషియన్ స్తంభం ఎక్కేందుకు నిచ్చెన వేయడంతో స్తంభం ఊగుతుంది. దీంతో ఎలక్ట్రీషియన్ భయపడుతున్నాడు. దీంతో స్తంభానికి విద్యుత్ దీపం ఏర్పాటు చేసే అవకాశం లేకపోగా వాలిన స్తంభంతో జనం భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారుల స్పందించి వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం

అద్దాల మండపానికి రూ.కోటి విరాళం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో అద్దాల మండపం ఏర్పాటు చేసేందుకు ఏలూరుకు చెందిన బి.కొండలరావు కోటి రూపాయల భారీ విరాళం అందించారు. ఇందుకు సంబంధించిన చెక్కును సోమవారం ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్వివిఎన్ఎన్.మూర్తికి అందించారు. ఆలయ అధికారులు దాతను శాలువాతో సత్కరించి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు.


దాతను సత్కరిస్తున్న ఆలయ ఇఒ

అనారోగ్య బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న బాదరాల రాంబాబు (48)కు కాపు సంక్షేమ సంస్థ కె9 ద్వారా రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. సోమవారం కె9 అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కె9 బృందం స్థానిక సుబ్బమ్మ పేటలో రాంబాబు ఇంటికి వెళ్లి అతని పరిస్థితిని పరిశీలించారు. కొంతకాలంగా కిడ్నీలు పని చేయకపోవడంతో ప్రభుత్వ సహాయంతో ప్రయివేట్ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కె 9 అధ్యక్షుడు శ్రీనివాస్ తాము సహాయం చేయడంతో పాటు ప్రభుత్వం నుంచి పెన్షన్ వచ్చే విధంగా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె9 గౌరవ అధ్యక్షులు కృష్ణ, కార్యదర్శి శీలం కృష్ణంరాజు, సహాయ కార్యదర్శి మనికే సత్యనారాయణ, కె 9 డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడు డాక్టర్ దుట్టా శివశంకర్, కె9 సాంఘిక సంక్షేమ విభాగం అధ్యక్షుడు గణిత ఆనంద ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

టీచర్కు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - దెందులూరు

రామశింగవరం పాఠశాలలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న సోషల్ స్కూల్ అసిస్టెంట్ వేమూరి చెంచులక్ష్మికి పెదవేగి మండలం ఎస్టియు కార్యవర్గం శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా ఎస్టియు పెదవేగి మండలాధ్యక్షులు పరసా నాగార్జున మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసి ఎంతో మంది విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దిన లక్ష్మి విరమణ చేయడం చాలా బాధకరమన్నారు. రిటైర్మెంట్ తర్వాత జీవితమంతా ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. ఎంఇఒ-2 అరుణ్ కుమార్, తాతపూడి ప్రవీణ్కుమార్, ప్రభాకర్ గుప్త, భూషణ్, సాయి శ్రీనివాస్, శ్రీను, లాజరు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వాలి

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బాబూరావు

ప్రజాశక్తి- ముదినేపల్లి

ముదినేపల్లి గ్రామ సచివాలయం ఎదురుగా ఉన్న వై జంక్షన్ రింగ్లో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం పెట్టుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులేలు డాక్టర్ శేవా నాగ జగన్ బాబూరావు పలు శాఖల మండల స్థాయి అధికారులను సోమవారం కలిసి వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ గతంలో కూడా తహశీల్దార్, ఎంపిడిఒ, ఆర్ అండ్ బి అధికారులను కలిసి వినతిపత్రాలు అందించినట్లు తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరినట్లు చెప్పారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని తెడ్లం గ్రామానికి చెందిన కేతిరెడ్డి సీతారామరెడ్డి, చంద్రకాంతమ్మ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కేతిరెడ్డి వీరారెడ్డి (చినబాబు) సోమవారం మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. ఇటీవల తెడ్లం గ్రామానికి చెందిన పెరవలి సరోజినీ, శీలం పెద్దింట్లు అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శించిన వీరారెడ్డి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేతిరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఐటిఐలో కాన్వకేషన్ సభ

ప్రజాశక్తి - ఏలూరు

పట్టణంలోని జిల్లాస్థాయి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటిఐ)లో నిర్వహించిన 2024- 25 విద్యా సంవత్సరపు "కాన్వకేషన్" సభకు అసిస్టెంట్ డైరెక్టర్ డి.భూషణం అధ్యక్షత వహించగా అతిథులుగా ఐఎంసి వైస్ ఛైర్మన్ పూడి భాస్కరరామం, సభ్యులు ఎల్.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఐటిఐలో వివిధ ట్రేడ్లల్లో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అర్హత సాధించిన విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఇంటర్న్షిప్ పూర్తి చేసుకుని ఉపాధి అవకాశాలను అందుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ రంగంలో ఇష్టంతో కష్టపడి చక్కగా పనిచేస్తూ మంచి అవకాశాల కోసం ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ ట్రైనింగ్ ఆఫీసర్ కె.రామచంద్రరావు, సిబ్బంది బి.ఇంద్రకుమార్, రవికిషోర్, అజయ్, ఎన్ఎఎస్డి సాగర్, మణిరత్నం, చింతారావు, నెహ్రు, జగన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

టీచర్లకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలి

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని, ఉపాధ్యాయుల రావాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం చేపట్టిన రణభేరి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25వ తేదీన గుంటూరు శ్రీ వెంకటేశ్వర జ్ఞాన మందిరంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ పిలుపునిచ్చారు. యుటిఎఫ్ జిల్లా కేంద్ర కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఎస్కె.ముస్తఫాలీ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో యుటిఎఫ్ రణభేరి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలల కాలమైనా ఇప్పటివరకు పిఆర్సి, ఐఆర్డిఎ బకాయిలపై ఒక స్పష్టమైన నిర్ణయాన్ని తీసుకోలేదన్నారు. ఇది ఉపాధ్యాయుల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకతకు కారణమవుతుందని, ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో ఒత్తిడి లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ ద్వారా ప్రమోషను కల్పించాలని, 12వ పిఆర్సి కమిషనర్ను నియమించాలని, డిఎలు విడుదల చేయాలని, పెండింగ్లో ఉన్న డిఎ బకాయిలు వెంటనే చెల్లించాలని, సిపిఎస్ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమాంతర మీడియం కొనసాగించాలని, 29 శాతం ఐఆర్ను వెంటనే ప్రకటించాలని, సెప్టెంబర్ 2004 కంటే ముందు నియామక ప్రక్రియ పూర్తయిన వారికి కేంద్ర ప్రభుత్వం మెమో నెంబర్ 57 ప్రకారం పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని, కోవిడ్ సమయంలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు కల్పించాలని, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, మున్సిపల్ టీచర్ల పిఎఫ్ సమస్య పరిష్కరించాలని, ప్లస్ టు హై స్కూల్స్ కొనసాగించాలని, ఎంటిఎస్ ఉద్యోగుల సర్వీస్ను రెగ్యులర్ చేయాలని, వారి ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ రూల్స్ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు ఇ.శివశంకర్, కె.కమల్కుమార్, జి.అంజనాదేవి, జిల్లా ఆడిట్ కన్వీనర్ బి.మోహన్రావు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఎండీ జిక్రియ, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ రణభేరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

ఉపాధ్యాయులుగా ఎంపికైన పోలీసులు

ఎస్పి సత్కారం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఉపాధ్యాయులుగా ఎంపికైన పోలీసులను ఎస్పి ప్రతాప్శివకిషోర్ ఆయన కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. జిల్లాలోని ఎఎన్ఎస్లో కానిస్టేబుల్గా పనిచేస్తున్న యు.శ్రీనివాసరావు, ట్రాఫిక్ కానిస్టేబుల్గా పనిచేస్తున్న ఎం.సుబ్రహ్మణ్యం, లక్కవరం పోలీస్ స్టేషన్లో మహిళా పోలీస్ కానిస్టేబుల్గా పనిచేస్తున్న వనజారాణి, మండవల్లి పోలీస్ స్టేషన్లో మహిళా కానిస్టేబుల్గా పనిచేస్తున్న పోతుల అఖిల శ్రావణి టీచర్లుగా ఉద్యోగాలు సాధించారు. వీరిని ఎస్పి సత్కరించారు.

పోలీసుల చొరవతో ఇంటికి చేరిన బాలికలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

తల్లిదండ్రులు మందలించారని కోపంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన ముగ్గురు బాలికలను పోలీసులు సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చిన వైనమిది. మండలంలోని గురజ గ్రామానికి చెందిన ముగ్గురు బాలికలు ఆదివారం ఇంట్లోని బీరువాలో ఉన్న నగదును తీస్తుండగా తల్లిదండ్రులు చూసి మందలించారు. దీంతో ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి ముగ్గురు బాలికలు బయటకు వెళ్లిపోయారు. పిల్లల ఆచూకీ కోసం తల్లిదండ్రులు ఎంత గాలించిన ఆచూకీ తెలియరాలేదు. దీంతో ఆదివారం సాయంత్రం తల్లిదండ్రులు ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వీరభద్రరావు ఆదేశాల మేరకు కానిస్టేబుల్స్ నాగబాబు, పవన్ బాలికల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గుడివాడ రైల్వే స్టేషన్లో ఆదివారం అర్ధరాత్రి తిరుపతి వెళ్లే రైలు కోసం వేసి చూస్తున్న ముగ్గురు బాలికలను పోలీసులు గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

పోరాటాలతోనే ఎల్ఐసి పాలసీలపై జిఎస్టి రద్దు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎల్ఐసి పాలసీలపై జిఎస్టి రద్దు చేసిన సందర్భంగా సోమవారం ఏలూరు బ్రాంచ్లో ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ నాయకులు, సభ్యులు ఈ విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొమ్మిదేళ్ల దీర్ఘకాలిక యూనియన్ పోరాటం ద్వారా జిఎస్టిని రద్దు చేయించినట్లు చెప్పారు. ఈ పోరాట విజయం పాలసీదారులకు అంకితమని ఎఒఐ రాష్ట్ర కార్యదర్శి జి.రవికిషోర్ అన్నారు. మరిన్ని ఏజెంట్ల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాల్సి ఉంటుందని, అందుకు యూనియన్ సభ్యులు, ఏజెంట్లు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు డివి.రామకృష్ణ, జోనల్ నాయకులు బి.రామ్మోహన్ రావు, డివిజన్ నాయకులు వైఎస్.కనకారావు, బ్రాంచ్ అధ్యక్షులు కోడె రాంబాబు, సెక్రటరీ సుర నాగరాజు పాల్గొన్నారు.

భీమడోలు : ఎల్ఐసి ఎఒఐ యూనియన్ పోరాటాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం జిఎస్టిని పూర్తిగా రద్దు చేసిందని భీమడోలు శాటిలైట్ కార్యాలయం ఎల్ఐసి ఎఒఐ గౌరవ అధ్యక్షులు గోదావరి జగన్మోహన్రావు అన్నారు. ఎల్ఐసి పాలసీలపై జిఎస్టిని నేటి నుంచి ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసిన నేపథ్యంలో భీమడోలులో విజయోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు శాటిలైట్ యూనియన్ అధ్యక్షులు కమ్మెల సుబ్బారావు, సెక్రటరీ తలగళ్ల శ్రీనివాసరావు, కోశాధికారి సీమకుర్తి హనుమంతరావు, వైస్ ప్రెసిడెంట్ బొజ్జ వెంకట దుర్గా ప్రసాద్, ఆర్గనైజన్ సెక్రటరీ పూజారి వెంకటరమణ, ఇసి మెంబర్లు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్లు వినియోగించుకోండి

ద్వారకాతిరుమల : మండల ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకం ప్రధానమంత్రి ఉజ్వల యోజన ద్వారా తిమ్మాపురంలో తెలుపు రేషన్ కార్డు కలిగిన ఇప్పటివరకు ఎటువంటి గ్యాస్ కనెక్షన్ లేని వారికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇస్తున్నట్లు శ్రీ శుభాంగ గ్యాస్ ఏజెన్సీ వారు తెలిపారు. అర్హులు శ్రీ శుభాంగ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ తీసుకొచ్చి సంప్రదించాలని తెలిపారు. వివరాలకు 7386015226 సంప్రదించాలని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఇళ్ల స్థలాలు, వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్ల సమస్య పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాలను అధికారులకు అందించారు. ఇళ్ల స్థలాలకు సంబంధించిన వినతిపత్రాన్ని తహశీల్దార్కు, పెన్షన్లకు సంబంధించిన వినతిపత్రాన్ని ఎంపిడిఒకు అందించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాలకు సంబంధించిన దరఖాస్తులను గ్రామ సచివాలయాల ద్వారా ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. పెన్షన్ల విషయమై అధికారులు స్పందిస్తూ అర్హులందరికీ పెన్షన్లు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు, జనా జగ్గారావు, ఎస్కె.సుభాషిని నాయకత్వం వహించారు.

వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

ఆశ్రం ఆధ్వర్యంలో క్లినిక్స్ ప్రారంభం

హాస్పటల్ ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హనుమంతరావు


మాట్లాడుతున్న డాక్టర్ హనుమంతరావు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రస్తుత కాలంలో యాంత్రిక జీవన విధానంతో వచ్చే వ్యాధులపై అన్ని వయస్సుల వారికి అవగాహన కల్పించి, అలాంటి వ్యాధులకు సరైన సమయంలో, సరైన చికిత్సను అందించడమే లక్ష్యంగా ఆశ్రం హాస్పిటల్స్ ఆధ్వర్యంలో క్లినిక్స్ ప్రారంభించినట్లు హాస్పిటల్ ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ కె.హనుమంతరావు తెలిపారు. సోమవారం ఆశ్రం హాస్పిటల్స్ పలు విభాగాల్లో స్పెషాలిటీ క్లినిక్స్ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ వృద్ధులకు ప్రత్యేక శ్రద్ధతో కూడిన వైద్యం అవసరమనే దిశగా సీనియర్ సిటిజన్ క్లినిక్స్, 50 సంవత్సరాల వయస్సు పైబడిన మగవారిలో మాత్రమే వచ్చే ప్రోస్టేట్ సమస్యలకు, ప్రోస్టేట్ కేన్సర్లకు ప్రత్యేక క్లినిక్స్ అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా హైరిస్క్ ప్రెగ్నెన్సీ క్లినిక్ ద్వారా గర్భధారణ సమయంలో ఏర్పడే పలు సమస్యలకు ప్రత్యేక పర్యవేక్షణ కోసం, హై-రిస్క్ ప్రెగ్నెన్సీ క్లినిక్ సేవలు అందించనుందని వెల్లడించారు.

విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్పిఆర్డి) ఆధ్వర్యంలో మత్స్యకారుల కమ్యూనిటీ హాలులో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్పిఆర్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎస్కె.సుభాషిణి మాట్లాడుతూ వికలాంగులకు నష్టం కలిగించే జిఒ 43ని ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పింఛన్ల వెరిఫికేషన్ పేరుతో అనేక మందిని తొలగించడం, పర్సంటేజీలు తగ్గించి ఇబ్బందులకు గురి చేయడం దారుణమని తెలిపారు. అర్హులకు ఇప్పటికీ సదరం సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమని విమర్శించారు. ఆన్లైన్ వెబ్సైట్ను వెంటనే ఓపెన్ చేసి స్లాట్లు బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పించాలని కోరారు. ఈ నెల 26న మరోసారి మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, ఎస్.రాంబాబు, లక్ష్మి, రత్నకుమారి, రమణ పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమానికి యూనియన్ కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షుడు చిన్ని తెలిపారు. స్థానిక జెడ్పి హైస్కూలులో సోమవారం లూయిస్ డాగూరే ఫొటో, వీడియో గ్రాఫర్ల యూనియన్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార మహోత్సవం యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు చిన్ని చేతులమీదుగా నూతన అధ్యక్షులు వాసు, ఉపాధ్యక్షులు మహరాజ్, కార్యదర్శి ప్రసాద్, సంయుక్త కార్యదర్శి మహేష్, ట్రెజరీ ఈశ్వర్, కార్యవర్గ సభ్యులు రవి, సునీల్, సాయిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ టి.నరసాపురంలోని యూనియన్ మంచి ప్రగతి పథంలో రాణిస్తూ సేవాకార్యక్రమాలు చేస్తుందన్నారు. ముందుముందు ఇంకా ఎన్నో సేవలు చేయాలన్నారు. ఆపదలో ఉన్న ఫొటోగ్రాఫర్లకు సహాయం చేయడమే ఈ కుటుంబ భరోసా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. నూతన అధ్యక్షుడు వాసు మాట్లాడుతూ అందరికి అందుబాటులో ఉంటానని, యూనియన్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ మహరాజ్ మాట్లాడుతూ యూనియన్ సేవలు వినియోగించుకోవాలన్నారు. జిల్లా కార్యదర్శి ప్రదీప్, కోశాధికారి మూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ సూరిబాబు, జిల్లా కన్వీనర్ ఖాన్, అమీర్ భాషా, ప్రసాద్, శివాజీ ఫ్యాకల్టీ, జీలుగుమిల్లి జంగారెడ్డిగూడెం అధ్యక్షుల కార్యదర్శులు, టి.నరసాపురం యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వృత్తి విద్య కోర్సులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పోలవరం

విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు వృత్తి విద్య కోర్సుల పట్ల అవగాహన కలిగి ఉండాలని వృత్తి విద్యా ఉపాధ్యాయురాలు పేరాబత్తుల శశికళ విద్యార్థులకు సూచించారు. మండలంలోని గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం చంద్రశేఖర్, స్కూల్ అసిస్టెంట్ కోరాడ రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఇంటర్న్షిప్ కార్యక్రమం చేశారు. విద్యార్థులు రిటైల్, మార్కెటింగ్ వృత్తి విద్యా కోర్సులను అభ్యసించడం ద్వారా అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. ఈ రంగాల్లో ఆర్థిక అభివృద్ధి సాధించడానికి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం కాకుండా ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి వృత్తి విద్యా కోర్సులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఆపన్నులకు అండగా సిఎంఆర్ఎఫ్'

ప్రజాశక్తి - ముసునూరు

ఆపదలో ఉన్న వ్యక్తులను ఆదుకోవడంలో సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతోగానో ఉపయోగపడుతుందని టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. మండలంలోని లోపూడి గ్రామానికి చెందిన మరిడి వీరవెంకయ్యకు రూ.40 వేల విలువైన ఎల్ఓసి చెక్కును మంత్రి కొలుసు పార్థసారథి అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డోలా వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరాలను మహిళలు వినియోగించుకోండి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

వేదాంతంతపురం ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్లో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి టిఎస్.రాజు, జనసేన నాయకులు అప్పనప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా ఈ శిబిరం ఏర్పాటు చేసిందని, అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ గీతారాణి మాట్లాడుతూ మహిళలు కేన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి టి.శ్రీను, సూపర్వైజర్లు భాషా, మరియమ్మ, ఎంఎల్హెచ్పిలు వినోద్కుమార్, రవితేజ, యువరాజు, ఎఎన్ఎం మణికుమారి, గంగాదేవి, బేబీకుమారి, హెల్త్ అసిస్టెంట్లు సుబ్బారావు, మోహన్, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టి.నరసాపురం : మహిళలు ప్రత్యేక వైద్య శిబిరాలు వినియోగంచుకోవాలని బండివారిగూడెం పంచాయతీ సర్పంచి నాళం టిరీషా అన్నారు. బండివారిగూడెం ఆరోగ్య కేంద్రం పరిధిలో సోమవారం మండల వైద్యాధికారి జె.కల్పనారాణి స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సర్పంచి హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యాధికారిణి కల్పనారాణి మహిళలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సిహెచ్కె.రాజు పాల్గొన్నారు.

ముసునూరు : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సర్పంచి కొండేటి విజయలక్ష్మి చెప్పారు. మండల కేంద్రమైన ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ సూపర్వైజర్ రాజ్యలక్ష్మి, పిహెచ్సి వైద్యులు షకీనా ఇవాంజెలిన్ ఆధ్వర్యంలో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి కొండేటి బాబి, సొసైటీ అధ్యక్షులు దేవినేని శ్రీధర్, స్కూల్ కమిటీ మాజీ ఛైర్మన్ నక్కా యోహాన్, టిడిపి యువ నాయకులు టి.రంగారావు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని దేవరగుంటలో సోమవారం గొల్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి అనూష మాట్లాడుతూ ప్రతి మహిళ ఆరోగ్యవంతమైన జీవనం సాగిస్తే ఆ కుటుంబం అంతా క్షేమంగా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. వైద్యాధికారి పి.శ్రీనివాస్గౌడ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ శ్రీనివాస్, పద్మావతి, ఎంఎల్హెచ్పిలు, ఎఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలవరం : మండలంలోని కొత్త పట్టిసీమ గ్రామంలో స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం సర్పంచి ముగాపుల విజయదుర్గ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచిత వైద్య సేవలు అందించారు. వైద్య బృందం గర్భిణులకు, యువతలకు, వృద్ధ మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, డాక్టర్ సుష్మ, కొత్తపట్టిసీమ సొసైటీ అధ్యక్షులు పూడి వెంకట్రావు, పట్టిసీమ వీరేశ్వరస్వామి ఆలయ కమిటీ వైస్ ఛైర్మన్ డోకల నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కోటా ప్రసాద్, గంట శ్రీనివాస్, కరిబండి నాగరాజు, వైసిపి సీనియర్ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా వ్యాప్తంగా 57 ఫిర్యాదులు అందాయని, వాటిని వెంటనే పరిష్కరించేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారని ఎస్పి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశం మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అర్జీల ద్వారా అందించిన సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించనున్నట్లు సబ్ కలెక్టర్ బి.వినూత్న తెలిపారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో సోమవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సబ్ కలెక్టర్కు అందించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ ప్రతి అర్జీ ఆన్లైన్ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోపు అన్ని సమస్యలు పరిష్కరించనున్నట్లు చెప్పారు. జటిలమైన సమస్యలు పరిష్కారం కాకుంటే వాటి వివరాలను అర్జీదారులకు వివరిస్తామన్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రజలు మొత్తం 43 రకాలైన సమస్యలను అర్జీల రూపంలో అందించినట్లు తెలిపారు. వివిధ శాఖలకు చెందిన డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

డిఆర్ఒకు విఆర్ఎల వినతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏలూరులో జరిగిన పిజిఆర్ఎస్లో మండల విఆర్ఎలు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రస్థాయి నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా కలెక్టర్కు విఆర్ఎల సమస్యలను విన్నవించుకోవడానికి వెళ్లగా కలెక్టర్ హైకోర్టుకు వెళ్లిన కారణంగా డిఆర్ఒ విశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. డిఆర్ఒ సానుకూలంగా స్పందించి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని, కలెక్టర్కు సిఫారసు చేస్తామని చెప్పినట్లు విఆర్ఎలు తెలిపారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ మొబైల్ క్యాంపులు

ప్రజాశక్తి - భీమడోలు

మండల పరిధిలో ఈ నెల 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ పద్మావతి దేవి తెలిపారు. ఈ మేరకు క్యాంపులు నిర్వహించే సచివాలయాల పరిధిలో క్యాంపుల గురించి విద్యార్థులకు, ప్రజలకు అవగాహన సదస్సులను నిర్వహించాలని, విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని కోరారు. క్యాంపుల్లో ఆధార్ నమోదు, ఆధార్ నవీకరణ, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయన్నారు. పొలసానిపల్లి గ్రామ సచివాలయ యూనిట్ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24వ తేదీల్లో భీమడోలు గ్రామ సచివాలయం-1 వేదికగా క్యాంపు ఉంటుందన్నారు. 25, 26వ తేదీల్లో పొలసానిపల్లి సచివాలయం వేదికగా క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. 23 నుంచి 26వ తేదీ వరకు దుద్దేపూడి గ్రామ సచివాలయం యూనిట్ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం వేదికగా ఆధార్ క్యాంపు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఓటర్ల జాబితా అవకతవకలపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి ఏలూరు సిటీ

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి వసంత మహల్ పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ఓటర్ల జాబితా అవకతవకలపై ప్రజల వద్ద నుంచి సంతకాల సేకరణ చేసినట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లాల్లోని ఏడు నియోజకవర్గాల ఇన్ఛార్జులు ఉన్నమట్ల ఎలిజా, మరీదు కృష్ణ, ఆలపాటి నరసింహమూర్తి, పెద్దిరెడ్డి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో కనీస వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణ పరిధిలోని జగనన్న కాలనీలో నివసిస్తున్న పేద ప్రజలకు ప్రభుత్వం వెంటనే కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, సబ్ కలెక్టర్కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ సమితి కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహా మాట్లాడుతూ జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నేతలు మడుపల్లి నాగేంద్రరావు, చెంగల వెంకటేశ్వరావు, ఆకునూరి విఘ్నేష్ పాల్గొన్నారు.

ఒరిజినల్ దస్తావేజు పోయినది

కలిదిండి లక్ష్మీపతిరాజు S/o.సోమరాజు డోర్నెం.7-22, కాలువ గట్టు, రైస్మిల్ దగ్గర, దిరుసుమర్రు గ్రామం, భీమవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా, నేను ది. 12.09.2025వ తేదిన దస్తావేజున్ను జిరాక్స్ తీయు నిమిత్తం మా ఇంటి నుండి దిరుసుమర్రు గ్రామంలోని రామాలయం రోడ్ లో వున్న జిరాక్సు సెంటర్కు వెళ్తుండగా మార్గ మధ్యంలో నాయొక్క ఒరిజినల్ దస్తావేజు నెం : 832/2021 పోయినది. నేను మరలా మార్గమధ్యంలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ ఎంత వెదికినా నా యొక్క ఒరిజినల్ దస్తావేజు దొరకలేదు. నా ఒరిజినల్ దస్తావేజు దొరికిన వారు పైన తెలిపిన అడ్రస్సులో అందచేయ ప్రార్ధన.

కలిదిండి లక్ష్మీపతిరాజు S/o.సోమరాజు